# దర్గామిట్ట కతలు

## పల్లెటూరి షాదీలో జజ్జనక!

ఈ జజ్జనకకు ప్రదాన కారణ కర్తలు యింకె వురో కాదు.

ఒకామె మా అమ్మ.

యింకొకామె మా వజీరత్త.

యీ అమ్మతల్లులిద్దరూ చేసివ పనికి మా చినత్త కొడుకు పెళ్ళిలో జరిగింది సామీ కతా. ఒక తట్టు తమాషా, యింకో తట్టు గలటా. ఆ తమాషా గలాటా ఏ తీరున జరిగిందనేదే యీ కత.

ఒకసారి మా చినత్త (మా నాయిన చిన చెల్లెలు) కొడుక్కి సంబందం చూసి రావడానికని మా చినత్త కుటుంబంతోపాటు మా అమ్మా నాయినా, మా వజీరత్తా ఎళ్ళేసొచ్చినారు ఒక పల్లెటూరికి. ( ఆ ఊరి పేరు చెప్పను. ఎందుకొచ్చిన గొడవ). పెళ్లికూతు రోళ్ల తరువు మంచి సంబందం యించుమించుగా ఖాయం అయ్యింది. యింక పెళ్లికొడుకు ఓకే అనడమే బాకీ. పెళ్లికొడుకు ఓకే అనాలంటే పెళ్లి కూతురు ఎట్టుంటదో తెలియాలి కాబట్టి అణ్ణుంచి మొదలయ్యింది కత.

ఏమంటే మా యిళ్ళల్లో పెళ్ళిళ్ళంటే అబ్బాయిని అమ్మాయి గానీ, అమ్మాయిని అబ్బాయి గానీ (కనీసం పోటోలన్నా) చూసుకునేదానికి లా. కొందరు అబ్బాయి పోటోనైనా యిస్తారుగానీ అమ్మాయి పోటో మాత్రం సచ్చినా యియ్యరు. గోషా. అందు వల్ల మా చినత్త కొడుకు కూడా అమ్మాయిని గానీ అమ్మాయి పాటోని గానీ చూసే బాగ్యానికి నోచుకోలా. అమ్మాయిని చూసొచ్చినోళ్ళు ఎట్ట చెబితే అట్ట ఊహించుకోవడటమే పాపం మా చినత్త కొడుక్కి మిగిలింది.

అయితే, యీణ్ణే మా చినత్త కొడుకు బుద్ది పొరపాటు పని చేసినాడు.

"పెళ్ళి కూతురు ఎట్టుంటది మా?" అని, ఒకటికి నాలుగు సార్లు మా చినత్తని అడగడానికి మొహ మాట పడి, బుద్దినేరకపోయి కంప్లీటుగా మా అమ్మ మీద, మా వజీరత్తమీద ఆదారపడి పాయినాడు పెళ్ళి కూతురి రూపురేకల కోసరం.

అసలికే మా అమ్మ, వజీరత్తా ఒక చోట చేరినా రంటే ఎవురికి తాటాకులు కడదామా అని చూస్తా ఉంటారు. అట్టాంటిది పెళ్ళి కొడుకే సాయంగా వొచ్చి చేతికి చిక్కిపోతే ఊరుకుంటారా? ఆట ఆడేసినారు.

"నాయినా! ఏమని తారీపు చేయమంటావు పో" అని మొదలు పెట్టింది మా అమ్మ, పెళ్ళి కూతురిని వర్ణించడానికి బరువుగా మొకం పెడతా.

"మాటలు చాలవు సామీ. ఏమి అందం... ఏమి అందం" అని, అందుకునింది మా నజీరత్త.


"రంగు. ఎట్టాంటి రంగులే. కడిగి నీళ్ళు తాగ వచ్చు. అంతటి తెలువు... తెలువు కూడా కాదు గులాబీ రంగు" అనింది మా అమ్మ.

"రంగుదేముంది సర్తాజా. నవ్వు ముక్యం. ఆ పిల్ల నవ్విందంటే సిరిదేవి నవ్వినట్టే గదా" అనింది మా వజీరత్త.

"నవ్వు సంగతేమో చెప్పలేము గానబయా. చీర కట్టుకుని కాసేపు ఆటా నడిచి చూపించింది. ఎంత బాగుందనా? జయపర్‌దానే అనుకో" అనింది మా అమ్మ.

వాళ్ళిట్ట ఒకోమాటా చెబుతా ఉంటే మా చినత్త కొడుకు కుర్సీలో కూచొని ఒకో అంగుళం పొంగి పోతా ఉన్నాడు.

అయితే ఆ పొంగు మీద సప్పంగా నీళ్ళు చల్లే దానికి అప్పణ్ణే మా యింటికి మా పెదత్త కొడుకు సమీరుభాయి వచ్చినాడు.




"రే... యీళ్ళ మాటలు నమ్మబాక. మునిగి పోతావు. ముందర పాటో చూసినాకనే ఊ అను" అన్నాడు, రావడం తోటే.

ఆ మాటలు యినంగానే వజీరత్తకి పొడుచుకొ చ్చింది.

"ఏమి నాయినా? నీ కంటికి మేమంత అబ ద్దాలు చెప్పేపోళ్ళంలాగా అవుపిస్తా ఉన్నామా? ఆ అమ్మాయి అందానికి తల తిరిగిపోతుంది తెలు సునా? మనిళ్లల్లో ఒక్కరు కూడా పనికిరారు" అనింది.

"చాల్చాల్లే ఊరుకోమ్మా. కడుపుకు కూడు తినే వోడెవుడన్నా మీ మాటలు నమ్ముతాడా? నాకు నెల్లూర్ఖులో పిల్లను చూసొచ్చి ఏమి చెప్పినారు మీరి ద్దరు? అమ్మాయి ఎర్రటి ఎరువు అని చెప్పలా. నిఖా టయిముకి నల్లటి నలువులో ఎట్టా మారి పోయింది? మీ మాటలు నమ్మి బావిలో పడినాను కదంటమ్మా" అన్నాడు సమీరుభాయి కచ్చగా.

"అప్పడంటే సరిగా గమనించక అట్టా చెప్పినాము గానీ యిప్పడు మాత్రం సత్తెం చెప్తా వున్నాము. యీ అమ్మాయికి వంక పెట్టేదానికే లా. వల్లకిలో దిగొచ్చిన హూర్ (దేవకన్య) లా ఉంటుంది" అనింది మా వజీరత్త.

"నేను నమ్మను. ముందు ఫ్లాటో తీసకరండి" అన్నాడు సమీరు భాయి.

"సమీరు మాటలకేమిగానీ నవ్వు మాత్రం బేఫి కర్‌గా ఉండబయా. అమ్మాయి అందానికి పూచీ నాది" అనింది మా అమ్మ.

మా చినత్త కొడుకు కుర్సీలో నుంచి పైకి లేచినాడు.

"ఏమో తల్లుల్లారా! మీ మాటలు నమ్మినాను. పెళ్ళికి ఆల్‌రైట్ అనినానని మా అమ్మకు చెప్పండి" అనేసి, ఎళ్ళిపాయినాడు.

ఆయన పోతా ఉంటే చూసి నెత్తి కొట్టుకున్నాడు సమీరు భాయి.

"యిప్పటికైనా నిజ్జం చెప్పండమ్మా. అమ్మాయి మీరు చెప్పినట్టుగానే ఉంటుందా?" అని అడిగినాడు మళ్లా. ( మా యిళ్ళల్లో పెళ్ళి చూపులంటే పెళ్ళి కొడుకు నాయిన, మేనమామ వంటి పెద్దోళ్ళు తప్పితే వయసులో ఉన్న మొగోళ్ళు ఎవ్వరూ

అమ్మాయిని చూడటానికి లా. అందువల్ల పెళ్ళి కొడుక్కి పెదమ్మ కొడుకైన సమీరు భాయి కూడా అమ్మాయిని చూళ్ళా!)

అప్పటిదాకా తాటాకులు కడతా వున్న మా అమ్మ, వజీరత్త యింకా పని ఆపి అసలు సంగతి కొచ్చినారు.

"నాయినా! అబద్ధం చెప్పేదానికి ఏముంది. ఆ అమ్మాయి చాలా మంచి పిల్ల. ఉర్దూ అరబీ ఖురాను చదువుకున్న వినయస్తురాలు. కాకపోతే కొంచెం సాయ (ఛాయ) తక్కువ. సాదాసీదాగా ఉంటుంది. చెప్పకునేంత అందగత్తె కాదు. అట్లాగని తీసి పారేయదానికి లేదు" అనింది మా అమ్మ.

"మరా మాట ఉన్నదున్నట్టుగానే వాడికి చెప్పొచ్చుగా" అన్నాడు సమీరు భాయి.

"ఎట్ట చెప్పమంటావు నాయినా. ఈ కాలపు పిలకాయలకి ఒకటికి నాలుగు చేసి చెబితేనే ఇళ్ళల్లోంచి ఆడపిలకాయలు కదలడంలా. ఉన్నదున్నట్టు చెబితే పెళ్ళిళ్ళు అయ్యేదానికేనా?" అనింది మా వజీరత్త.

ఆ మాటలకు మళ్ళా నెత్తి కొట్టుకుంటా "సచ్చాడ్లే నా కొడుకు" అని గొణుక్కున్నాడు సమీరు భాయి.

రోళ్ళు పగిలే ఎండాకాలం. పల్లెటూరిలో షాదీ.

ఒంటి పూట బడికి ఎగనామం పెట్టేసి యమా హుషారుగా తిరగతా ఉన్నాను పెళ్ళిలో. పెళ్ళి కొడుకు ఊరేగింపులో గుర్రం యాడకి పోతే అణ్ణే నా మకాం. ఒక రకంగా పెళ్ళి కొడుకును ఫాలో చెయ్యడటమే నా పనిగా వుండింది పెళ్ళిలో.

మద్యానం రెండింటికి 'నిఖా' జరిగిపోయింది. పెళ్ళి కొచ్చినోళ్ళంతా తాటాకు పసారాలో కూచొని చెమటలకి సస్తామా బతకతామా అన్నట్టుగా పలావులు తినేశారు.

ఒక తట్టు విందు జరగతా ఉంటే యింకోతట్టు పెళ్ళి కొడుకు ఎప్పడెప్పడు సాయంత్రమవద్దా, ఎప్పడెప్పడు పెళ్ళి కూతురిని చూద్దామా అని ఆరాటం ఆరాటంగా తిరగతా ఉన్నాడు.

సాయంత్రమయ్యింది.

జల్వా! ( ఇది పెళ్ళి కొడుక్కి పెళ్ళి కూతురిని పరిచయం చేసే అమ్మలక్కల కార్యక్రమం. ఈ కార్యక్రమంలోనే తొలిసారిగా పెళ్ళి కూతురిని చూస్తాడు పెళ్ళి కొడుకు.)

నవారు మంచం పరిచి ఒక తట్టు పెళ్ళి కొడుకుని, యింకో తట్టు పెళ్ళి కూతురిని కూచోబెట్టినారు అమ్మలక్కలు జల్వా కోసరం.

"చూడు పెళ్ళి కొడక. పెళ్ళి కూతురు ఎట్టుందో చూడు" అని, ఒక ముత్తయిదువ పెళ్ళి కూతురి ఘూంఘట్‌ని పైకి తీసింది.

అంతే! మనోడి మొకంలో నిండా నీళ్ళు దిగిపాయినాయి. మామూలుగా చూసుంటే వచ్చేసేదేమో గానీ మా అమ్మా, వజీరత్తా ఫుల్లుగా పంపుకొట్టి వదిలిపెట్టున్నారు కదా ఆ ఎక్స్‌పెక్టేషనుకు తగినట్టుగా పెళ్ళి కూతురు ఆనలా.

దానికి తోడు పొద్దున్నుంచి ఏడ్చీ ఏడ్చీ (అట్టా ఏడ్వకపోతే 'అత్తారింటికి పోతా వున్నా ఆ పిల్ల కంట్లో చుక్క నీరు పుట్టలేదమ్మా' అని బుగ్గలు నొక్కు కుంటారు అమ్మలక్కలు), ఎండకి చెమటలు కార్చీ కార్చీ నల్లంగయి ఉంది పెళ్ళి కూతురి మొకం.

మనోడు ఆ మొకాన్ని చూడగానే జల్వాలా. గిల్వాలా. లటక్కన పైకి లేచేసి, మంచం మీది నుంచి ఒక్క దూకు దూకి, బస్టాండు తట్టు అదే పోవడం!

"పెళ్ళి కొడుకు అలిగెళ్ళి పోయినాడు. అమ్మాయి నచ్చలేదులాగుంది" అనే మాట బయటికొచ్చేసరికి ఆడోళ్ళంతా హాహాకారాలు, మొగోళ్ళంతా 'అరెరెరె'లు అయిపొయినారు క్షణాల్లో.

నస్టు ఎఫెక్టయ్యింది పెళ్ళి కూతురి తల్లి. దబ్బుంటా సోదీనం తప్పి పడిపోయిందామె.

"పెళ్ళి కూతురి తల్లి పడి పోయింది, పెళ్లికూతురి తల్లి పడి పోయింది" అని పందిట్లో గోల మొదలుకాంగానే ఏమనుకుందో ఏమో మా చినత్త కూడా దబ్బుంటా సోదీనం తప్పి పడిపోయింది.

"అరెరెరె... పెళ్లికొడుకు అమ్మ కూడా పడిపోయింది" అని మళ్ళా పందిట్లో గోల.

మా చినత్త బర్త అదరాబదరాగా వచ్చి, మంచానికి యీ పక్క ఒకరు ఆపక్క ఒకరు పడిపోయున్న ఆడోళ్ళని చూసి తల పట్టుకున్నాడు.

అప్పటికే ఆడ పెళ్ళోళ్లందరూ మల్లుకున్నారాయన్ని.

"య్యో పెద్దాయన! పెళ్ళి కూతురు ఎట్టుంటదో ముందే నీ కొడుక్కి చెప్పలా? మా పిల్లకి ఏమి తక్కువని అట్టా లేచెళ్ళి పోయినాడు?" అని యింతెత్తుకు లేచినారు.

"లేచెళ్ళక కూచోమంటాడటమ్మా? ముందే పొటో చూపిచ్చుంటే అసలికీ గొడవే వచ్చుండేది కాదు గదా. ఒకటికి నాలుగుసార్లు చూసుకునే చేసుకునేవాడు" అన్నారెవరో, మా చినత్త బర్తకి మద్దతుగా.

'పొటో' అన్న మాట యినంగానే యాడున్నాడో ఏందో గానీ తోసుకొని వచ్చేసినాడు సమీర్ భాయి.

"ఆ తెలివి వాళ్ళకుండాలయ్యా. మేము అడిగినా అడక్కపోయినా 'అబ్బాయి చూస్తాడే, యిద్దామే' అని పొటో యిచ్చి పంపేబళ్ళా." అన్నాడు, చేతులాడిస్తా.

'య్యో! అట్టా పొటోలు చూపించే ఖాందాన్ తక్కువ వంశం కాదు మాది. అట్టాంటి గోషా తక్కువ పనులు మేము చేయము" అంటా పౌరుషంగా అన్నాడు పెళ్ళికూతురి అన్న.

"అంటే మాది ఖాందాన్ తక్కువ వంశమా?" అన్నాడు సమీర్ భాయి, చొక్కా చేతులు మడిచినంత పనిచేస్తా.

"మీ ఖాందాన్‌లను మట్టిలో పెట్టి కప్పెట్ట. ముందు పెళ్ళికొడుకును పట్టకరండయ్యా" అని అరిచినారెవరో.

అంతటితో గలాటా మాని పోలోమంటా అందరూ బస్టాండుకు పరిగెత్తినారు. అందరికంటే ముందు మా అమ్మ, వజీరత్త.

"మ్మో! మీకు దండం పెడతా. యింకేమి చెప్పకాకండి. చేసింది చాలు" అన్నాడు పెళ్ళికొడుకు వాళ్ళిద్దరినీ చూడంగానే బెంగపడిన మొకంతో.

ఇంతలో మా చినత్త బర్త వచ్చినాడు.

"రే. పా. ఇది పద్దతి కాదు" అన్నాడు, అదికారంగా.

"నేను రాను. అట్టాంటి అమ్మాయినా చేసేది?" అన్నాడు పెళ్ళికొడుకు, అలకమొకాన్ని కంటిన్యూ చేస్తానే.

"నీ మొకం. ఎండకి పెగదెబ్బ తగిలి ఆ అమ్మాయట్టా వాడి పోయింది గానీ ఎంత కళని. పా. సరిగా చూడ్డుగానీ" అన్నాడు మా చినత్త బర్త.

పెళ్ళికొడుకు కదల్లా.

"ఏమి... తమాషాలా? కదులు. అవుతల మీ అమ్మ సోదీనం తప్పి పడి పోయింది" అన్నాడు అదిలిస్తా.

ఆయన అదిలింపుకన్నా మా చినత్త పదకమే పారి, సెంటిమెంటు పని చేసింది. కదలక తప్పలేదు పెళ్ళి కొడుక్కి.

అయితే కడుపులో బాద తీర్చుకోనడానికన్నట్టు, బస్టాండు నుంచి మళ్లా పెళ్ళి కూతురి ఇంటికి చేరుకునే లోపు మా వజీరత్త బర్తను పిలిచి, యింత గలాటాకు కారణమైన "పెళ్లి కూతురి వర్ణన"ను చెప్పేశాడు పెళ్లి కొడుకు.

దాంతో మా వజీరత్త బర్తకు రేగిపోయింది. పెళ్ళి పందిరని కూడా చూడకుండా మా వజీరత్తని పిలిచీ... గుండం తొక్కినాడు చూడూ... జజ్జనక... జజ్జనక... దాన్నే!

(ఇప్పడు మా చినత్త కొడుక్కి ముగ్గురు బిడ్డలు. జల్వాలో ఎవర్ని చూసయితే అలిగినాడో ఆమె మీద తెల్లారే పాటికి అలక తీర్చేసుకొని మరుసటి రోజు నుంచే సుకంగా కాపరం మొదులుపెట్టినాడు. అయితే ఆ పెళ్ళిలోని అలక కలని ఆ తర్వాత మా ఇళ్ళల్లో మొగపిలకాయలెవ్వరూ మర్చిపోలా. ఎవురికైనా పెళ్ళి చూపులు అనంగానే "తల్లులారా! మీరేమీ చెప్పొద్దు. బాగున్నా బాగ లాకపోయినా ఒక్కమారు పొటో చూపిచ్చేయండి చాలు" అంటా ఉన్నారు. మా చినత్త కొడుకు పెళ్లితర్వాత మా యిళ్లల్లో పొటో చూడకుండా ఎవురి పెళ్లీ జరగలా.)

—మహమ్మద్ ఖదీర్‌బాబు